# గొంగళిపురుగు

అసిరిగాడు గట్టిగా ఊపిరి పీల్చేడు. చివరిసారిగా దమ్ము లాగి బీడీముక్కని అవతలకి విసిరేశాడు. ఒకసారి ఒళ్ళు విరుచుకున్నాడు. ఒళ్ళంతా విరగ్గొట్టినట్టు, పచ్చిపుండులా వున్నట్టు అనిపించింది. కళ్ళు చీకిరిస్తూ, రెప్పలు తాటించాడు. నులివేడిగా చెమర్చినై కళ్ళు. 'జొరం వొచ్చేట్టుంది....'

"ఆకలిగా వుంది" పొట్ట నరాలన్నీ గుప్పిటబట్టి పిండినట్లవుతోంది.

చుట్టూ చూసేడు. ఎదురుగా వీధిదీపం అసిరిగాడి కడుపులో ఆకలిలా మండిపోతోంది. దాని క్రిందుగా మిఠాయి బండిని ఆపుకొని జనం రాకకోసం వేచిచూస్తున్న సేఠ్‌జీ– చిప్స్‌పళ్లెం సరిచేస్తున్నాడు. అతని ప్రక్కగా ముంత మసాలా అమ్ముకునే అతను– "గరం గరం మసాలా" అని కేకేస్తున్నాడు. వీళ్లిద్దరికీ అవతలగా పళ్ళ దుకాణం.

అన్నీ తినుబండారాలే! అసిరిగాణ్ని ఆకలి దహించేస్తున్నది.

క్షణం ఆలోచించి తక్కున గొంతుకూర్చున్నాడు అసిరిగాడు. నరాల్లో సత్తువ కూడదీసుకుని– కార్యక్రమానికి సిద్ధపడ్డాడు. నిక్కరు జేబులోంచి తన ఆయుధాన్ని తీసేడు. నల్లటి బొగ్గుకణిక! సిమ్మెంటు రోడ్డుమీద దుమ్మును కొంతమేర దులిపి గీయటం మొదలుపెట్టాడు.

ఎడమ చేతిలో కోదండాన్ని ధరించి, కుడిచేత్తో అభయాన్ని ఇస్తున్న శ్రీరాముడు క్షణాల్లో ప్రత్యక్షమైనాడు.

సినిమాహాలు గంట వినిపించింది, ఆట వదిలేరు. తెచ్చి పెట్టుకున్న ఉత్సాహంతో మరొక బొమ్మ ప్రారంభించాడు. జనం కోలాహలం మొదలయింది. రోడ్డుమీద రద్దీ ఎక్కువయింది. దారిన పోయే జనం శ్రీరాముడికి చుట్టూ నిలబడుతున్నారు. అసిరిగాడి ఆలోచనలనిండా ఆశ ముసురుకుందోంది. ఆకలితో జఠరాగ్ని కసురు కుంటోంది.

ప్రఖ్యాత సినిమా తార బొమ్మ దేవకన్య అలంకరణలో మెరిసి పోతోంది. ఎడమ చేతిని తలకిందవుంచి, కుడిచేత్తో చంద్రుని చూపుతూ, కళ్లల్లో కొంటెతనాన్ని ప్రదర్శిస్తూ, వొత్తిగిలిపడుకుంది.

బొమ్మను పూర్తిచేసి తల పైకెత్తాడు అసిరిగాడు. వాడి కళ్లల్లో మెరుపు. అప్పటికప్పుడే అక్కడ పెద్ద గుంపు చేరింది. ఎక్కువ మంది జనం వుంటే- రాబడికి అవకాశం ఎక్కువ. అసిరిగాడి కడుపులో ఆకలి కళ్లల్లో జాలిగా సుళ్లుతిప్పుతోంది. ఒక్కొక్కరి మొహమే పరీక్షగా చూడసాగేడు. అందరూ సినిమాతార అవయవాల వొంపు సొంపుల్ని చూసి ముగ్ధులవుతున్నట్లు తెలుస్తోంది. కాని తన సంగతి ఎవరూ పట్టించుకున్నట్లు తోచడంలేదు అసిరిగాడికి.

"సింప్లీ మార్వలెస్ ! పోజు అద్భుతంగా వుంది" మాటలు చూపుల్ని ఆకర్షించాయి. అసిరిగాడు గుటకలు మింగుతూ ఆవైపు చూశాడు. ఒక సంపన్న కుటుంబానికి చెందిన యువకుడు ఆ బొమ్మ వైపు తన్మయత్వంతో చూస్తున్నాడు. "మూడురోజుల నాటి ఆకలి బాధ ఈక్షణంతోసరి...." అసిరిగాడి మనసులో కోటి కోర్కెల తాలూకు ఆశ : ఆ యువకుడివైపు కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ గొంతు

సవరించుకున్నాడు. ఆ యువకుడు గాలిలో చేతులు ఆడించుకుంటూ జారుకున్నాడు.

క్షణం క్రితం ఆకాశాన్ని ముద్దెట్టుకున్న ఆశ- అగాధంలో పడి మట్టికరిచింది.

నలుగురి వైపూ ప్రాధేయపడుతున్నట్లు చూపులు నిగిడ్చేడు అసిరిగాడు. జనమంతా ఒక్కరొక్కరుగా వెళ్ళిపోతున్నారు. "బాబ్బాబు — వెళ్లిపోకండి, ఒక్క పైసా అన్నా ధర్మం చేయండి. ఈ ఆకలితో నేను చచ్చిపోయేట్టున్నాను —" అని, ఇంకా ఏదేదో చెప్పాలని పిస్తోంది అసిరిగాడికి. "ఆకలి_ఆకలి_ఆకలి" అని గొంతెత్తి అరవాలనిపిస్తోంది. కాని -

కాని అసిరిగాడి గొంతు పెగలదు. అది వాడి శాపం.

అసిరిగాడి కళ్లల్లో నీళ్లు తిరిగినై.

అంతా వెళ్లిపోయారు. ఒక్క గజ్జికుక్క తప్ప!

నీళ్ళు నిండిన కళ్లల్లో నిన్న మొన్నటి అనుభవాలన్నో కనిపించేయి అసిరిగాడికి. మొన్నంతా అసిరిగాడు ఎంతో దీక్షగా పట్టుదలగా పనిచేశాడు. సెంటర్లో అర్ధచంద్రాకారంలో హుందాగా నిలబడిన వెండి బంగారు షాపులకు ముందున్న మురికి కాల్వలో సుమారు రెండు ఫర్లాంగుల మేర గాలించి పారేశాడు. చాలా కాలం నుంచీ అనుభవమున్న పని యిది. పైగా అసిరిగాడు కాలువలో చెయ్యి పెట్టాడంటే వీసమెత్తు బంగారమున్నా అందకుండ పోదని అతని సాటి వాళ్లంతా అంటూంటారు. మొన్నమాత్రం వీసంమెత్తు బంగారం లేదు సరికదా పడ్లగింజయెత్తు రాగికూడా దొరకలేదు. ప్రతి సారీ విరిగిన రాగి చీలలన్నా చేటలో చేరుకునేవి. ఈసారి ఎత్తు గుల్లలూ, సీసం పెంకులూ, మేకులూ, తీగెలూ ప్రత్యక్షమైనాయి.

వెండిబంగారం షాపులకు వెనగ్గా అదే పనిచేసే స్వర్ణకారుల కొట్లున్నాయి. వాటి ముందేవుంది - అసిరిగాడి జీవనది. ఆశ చంపుకోలేక ఆ రాత్రి- ఆ జీవనదిలోనే కాళ్లూ, చేతులూ కడుక్కున్నాడు అసిరిగాడు. నిలువెత్తు నీరసం తప్ప లాభించిందేఁవీ లేదు.

అందుకనే, నిన్న- చింకి చేటకూ, కురచ చీపురుకూ విశ్రాంతి నిచ్చి 'బొగ్గుకణిక'ని చేతపట్టాడు. నిన్నల్లా పట్నంలోని సెంటర్లన్నీ ఖరాబు చేయటమే జరిగింది కానీ చేతికి పైసాకూడా దక్కలేదు.

మునిసిపాలిటీ పంపు నీళ్లు తాగుతూ నిన్నరాత్రి అనుకున్నాడు అసిరిగాడు "ఇది వరకు దేవుడి బొమ్మలు గీస్తే పైసా, అర పైసా పడేసేవాళ్లు జనం. ఇప్పుడు దేవుడైనా లేదు. దయ్యమైనా లేదు"అని.

బొంబాయి విలాస్ కెదురుగా బట్టల షాపు అరుగుమీద పడుకుని హోటల్లో కేకులు, బిస్కెట్లు, బన్‌జామ్‌లు, పరోటాలూ తింటూ టీ తాగిపోతున్న ఆసాముల్ని చూస్తూ తెల్లవార్చేడు - నిన్నరాత్రి.

ఇవాళ పొద్దుట్నుంచీ ఆకలి మరీ నక నక లాడుతుంటే, సందు సందూ గొంది గొందీ తిరిగేడు. "ఈ దేశంలో ముష్టికి నష్టి లేదనీ, ఏ గతీ లేకపోతే అడుక్కుతిని బతకొచ్చనీ -" అసిరిగాడి మాఁవ పోతురాజు అంటూ వుండేవాడు. మాఁవ చచ్చి ఏ లోకాన్న వున్నాడో గానీ వాడి మాటల్లో నిజంలేదని అనుభవపూర్వకంగా నేర్చుకున్నాడు అసిరిగాడు. "మీ యింట్లో దొడ్డి బాగుచేసి పోతాను - ఒక్క ముద్ద అన్నం పెట్టించమని" సైగచేస్తూ గుమ్మం-గుమ్మం తిరిగేడు-అసిరిగాడివ్వాళ. కానీ, ప్రతి మనిషి నోసలూ వాణ్ణి వెక్కిరించాయి. కొందరైతే తిట్టనుకూడా తిట్టేరు-"స్ట్రయిక్ చేస్తుంటిరే 'స్ట్రయిక్'. చెయ్యండి. మధ్యలో ఈ దేబిరింతలెందుకు" అని దెప్పిపొడిచారు. "పోరా దొంగ వెధవా" అని కసిరి కొట్టారు.

దృశ్యం తరువాత దృశ్యం కనుపడుగపుతూ వుంటే-గుండెలు గుబగుబలాడ సాగిన్నై అసిరిగాడికి.

కళ్లు తుడుచుకుని లేచాడు. గజ్జికుక్క కూడా వెళ్లిపోయింది. మిఠాయి బండి దగ్గర తారట్లాడుతోంది. ఆ బండిచుట్టూ క్రింద పడిన కాగితాలు, ఆకులు వెతుక్కుంటూ, ఒకటీ అరాగా మిగిలిన చితుకులు ఏరుకు తింటోంది.

'కుక్క కన్నా హీనంగా తయ్యారైంది నాగతి' అనిపించింది అసిరిగాడికి 'విన్న అనుభవంలో కొచ్చినా అనవసరంగా యియ్యాల ఎదవ గీతలు గీసినా'ననిపించింది.

ముందుకు కదిలేడు. కాళ్లు నిస్సత్తువగా వున్నై. కళ్లు తేలిపోతున్నాయి. ఎటుపోవాలో ఏం చేయాలో తోచటంలేదు వాడికి. భారంగా అడుగులు వేస్తూ నడవ సాగేడు.

చాలా ఘనమైన ఊరేగింపు ఎదురైంది. కారు నిండా పూల దండలు, కారుకి ముందు యూనిఫారం వేసుకున్న 'బ్యాండ్', ఎత్తుగా పట్టుకున్న పెట్రోమాక్స్ లైట్లు, ఖరీదైన దుస్తుల్లో ఆడామగా పెళ్లివారు, పెళ్లివారి తాంబూలపు మెత్తని మత్తులాంటి వాసనలు! మేళం వాళ్లు పాట పాడుతున్నారు "పందిట్లో పెళ్లవుతున్నదీ...."

అసిరిగాడు పక్కకు తప్పుకుని నిలబడ్డాడు.

"లక్ష రూపాయలు కట్నంట." "పిల్లవాడు డాక్టరు" .... "పిల్లా డాక్టరే- వాళ్లకేం మహరాజులు."

—రక రకాల వ్యాఖ్యలు వినపడుతున్నాయి.

'లక్ష రూపాయలు' - అసిరిగాడి మనస్సు గొణుక్కున్నది. ఆకలి నసిగింది. "ఛీ.... వెధవాలోచనలు" అంటూ కసురుకొంది.

ఊరేగింపు సాగిపోతోంది.

పైనగ్గా వెళదామా అనిపించింది అసిరిగాడికి. కాని -

మూడు రోజుల క్రితం జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది.

ఆ రోజు -

చైర్మన్ గారింట్లో పెళ్లికి తమ బలగమంతా తరలి వెళ్లింది. లేడీస్ క్లబ్ ఆవరణలో 'అబ్బో. ఏం విందు' కళ్లు చెదరిపోయేదీపాలు లెక్కపెట్టలేనన్ని బల్లలూ, కుర్చీలూ సుమారు వెయ్యి విస్తళ్ళన్నా పడతయ్యంటే ఎంత సంబరం మరి!

'బల్లల మీద బారుగా కాగితాలు పరిచేసి, వాటిమీద విస్తళ్లు వేయటం తను కళ్లారా చూసాడు. ఇదేదో కొత్తగా వుందనుకున్నాడు కూడా. లోపల వడ్డన మొదలెట్టారో లేదో— బయట తమ బలగంలో గలాటా మొదలైంది. నరసయ్య, అచ్చిగాడు పోట్లాడేసు కున్నారు. అసలే ఆళ్ళిద్దరికీ పడదు. "ఇస్తళ్ళ కాడికి మీ వోళ్ళు రాకూడదటంటే మీ వోళ్ళు రావటానికి వీల్లేదంటూ" ఇద్దరూ ఇంతంతెత్తు ఎగిరిపోవటం మొదలెట్టేరు. రెండుపార్టీలై పొయ్యారు. తమ వోళ్ళంతా గర్షన ఎక్కువైపోయి చేతులు కలుపుకునే దాకా పొయ్యింది.'

చైర్మన్‌గారికి యీ సంగతి తెలిసింది. వీళ్ళందరి ఆగడం చూసి ఆయన మండి పడ్డాడు. అసలే కోపిష్టికావటంతో-కాస్సేపు చిందులు తొక్కి అసలు విస్తళ్లు బయట వేయించను పొమ్మన్నాడు. ఎవరెంత చెప్పినా ఆయన ససేమిరా విన్లేదు. చివరికి భోజనాలయిన తర్వాత విస్తళ్ళు చుట్టిన కాగితాలన్నింటినీ—క్లబ్ కాంపౌండ్‌ను ఆనుకుని వున్న పడవల కాలవలో గిరవాటేయించాడు.

పిల్లాపితుకూ ఆకలికి నకనకలాడుతూ లబోదిబో మన్నారు. తామంతా కాళ్లీడ్చుకుంటూ గుడిసెలకి సేరుకున్నారు.

"ఇప్పుడూ అట్టాగే ఏం జరుగుతాదో - అయినా యీళ్ళదే పేటో ఏం పాడో" అనిపించింది అసిరిగాడికి.

కడుపులో కాలుతున్నా, నిరాశ, నిస్పృహ ఆక్షణంలో వాడిని వెనక్కు లాగినై.

అడుగు కదిల్చేడు. వైన్‌షాప్‌లోంచీ వాసన తగిలింది. అటు వైపుగా చూసేడు. కళ్ళు మిరుమిట్లు గొలుపుతూ దొరసాని బొమ్మ చేతిలో కొంగమెడలాంటి గ్లాసు. బొమ్మకు పైగా నియోన్‌లైట్లు ఎర్రిగా వెలుగుతున్నై.

అసిరిగాడి నరాల్లో ఆకలి ఎర్రదనం- నియోన్‌లైట్ల ఎర్రిదనంతో పోటీ పడసాగింది.

బొమ్మను చూస్తూ నిలబడిపోయిన అసిరిగాడికి పెళ్ళాం గుర్తుకొచ్చింది. నాంచారమ్మ పోయి రెండేళ్ళయ్యింది. "మసూచికంతో మహారాణిలా పొయ్యింది-అదే అదురుట్టమంతురాలు" అనుకున్నాడు అసిరిగాడు. కాని, 'నా అనోళ్ళెవరూ లేకుండా నాగతి యిట్టాసేసి పొయ్యింది' అని కోపంలాంటి ఉక్రోషమూ నచ్చింది. కళ్ళు చెమ్మగిల్లినై. వెచ్చని నీరు చెంపల్ని తడిపింది. కుడి అరచేత్తో చెంపల్ని తుడుచుకుని కదిలేడు.

చల్లటిగాలి తిరిగింది. సన్నని తుంపర కూడా మొదలైంది.

అసిరిగాడికి వెన్ను జివజివలాడింది. ఒళ్ళంతా వేడి పాకింది. వేడితోపాటు ఆకలి కాక ఎక్కువ కాసాంది.

రెండు అంగల్లోమలుపు తిరిగేడు. మురుగుకాల్వ వాసన, కుళ్ళిపోయిన చెరకుగడ్డి వాసనా కలగాపులగమై - కడుపులో దేవి నట్టైంది.

అపిరియత్నంగా ఈ దారికొచ్చిన అసిరిగాడికి చప్పున వో

ఆలోచన స్ఫురించింది. గబగబా నడవసాగేడు.

బియ్యపు మిల్లు దాటి రెండడుగులు వేయగానే తన పని మొదలెట్టాడు అసిరిగాడు. ఆ రోడ్డును ఆనుకుని కూరల మార్కెట్ వుంది. ఈ రోడ్డు మీద పగలల్లా కూరల వ్యాపారం జరుగుతుంది. మార్కెట్టులో కొట్టులేనివాళ్లు, పల్లెల నుంచి తట్టలతో కూరలు తెచ్చుకుని అమ్ముకుపోయేవాళ్లు ఈ రోడ్డు మీదనే వ్యాపారం చేస్తారు. పగలల్లా చిల్లరమల్లర వ్యాపారం జరుగుతుంది కనుక, కూరల వ్యాపారస్తులు చిల్లరడబ్బులూ అవీ ఏ గోనెపట్టాల క్రిందనో వుంచుకుంటూ వుంటారు గనుక- ఏదో వో నాణెం దొరికే అవకాశం వుందని అక్కడ జేరేడు అసిరిగాడు. ముందుకువంగి చెత్తాచెదారాన్ని చేత్తో పక్కకి తోసేస్తూ కళ్లలో వత్తులు వేసుకుని వెదకసాగేడు అసిరిగాడు.

వానజల్లు పెద్దదయ్యింది.

ఫర్లాంగు పొడుగున్న రోడ్డుకు సరిగ్గా సగంలో వున్నాడు అసిరిగాడు. రోడ్డుకు మధ్యగా వంగి అటూ యిటూ కూడా వెతుకుతున్నాడు.

వానతోపాటు అసిరిగాడి శరీరంలో వణుకు ఎక్కువ కాసాగింది. కాని ఆకలి- అసిరిగాడి శరీరాన్ని లక్ష్యపెట్ట నీయటంలేదు.

అసిరిగాడి మనస్సులో ఆతృత ! కడుపులో ఆకలి ! గుండెల్లో గుబులు. శరీరంలో ఉష్ణం !

గబగబా తనపని చేసుకుపోతున్న అసిరిగాడికి- ఎక్కడా ఒక్క పైసాకూడా కనిపించకపోవడంతో ఆందోళన ఎక్కువ కాసాగింది.

ఎండిన అరిటాకుని పక్కకు తోశాడు. దానిక్రింద చాలా చిన్న దోసకాయ ఎండిపోయి, వొరుగులా తయారైంది. ఆబగా నోట్లో

వేసుకున్నాడు అసిరిగాడు. కసుక్కున నమిలేడు. వెంటనే "ఛూ(!" అంటూ ఉమ్మేశాడు. "చేదు యిసం" అనుకున్నాడు. కేకరించి రెండు మూడు సార్లు ఉమ్ముతూ వెదకసాగేడు.

వాన ఉధృత్మైంది.

ఎక్కడో పిడుగు పడింది. అసిరిగాడి గుండెలు అవిసిపోయినై.

విసుగ్గా చిరాగ్గా లేచాడు. నడుం పట్టుకుని వెనక్కి వంగేడు. రెండు చేతుల్తోనూ మెడ నరాలు నొక్కుకున్నాడు, జుట్టుమీద నుంచి కారుతున్న వాన నీటిని చేత్తో తుడుచుకున్నాడు.

అంత శ్రమపడినా ప్రయోజనం కనిపించలేదనే వాస్తవం అతన్ని నిలువునా కుంగదీసింది.

అసిరిగాడికి ఏడుపు ముంచుకొచ్చింది. "అసలీ ఆకలికున్న జబ్బే యిది. ఏడిస్తే ఎక్కువౌతుంది!" అనుకున్నాడు. అంతలోనే 'కాదు అసలీ ఏడుపుకున్న రోగమే ఇది- ఆకలిని ఎక్కువచేస్తుంది' అనుకున్నాడు.

కాళ్ళల్లో నీరసం కళ్ళలోకి చేరుకున్నా- కళ్ళు పెద్దవి చేసుకుని రోడ్డుమీద పరీక్షిస్తూనే తచ్చాడ సాగేడు.

ఉన్నట్టుండి అసిరిగాడి కళ్ళు మిలమిలా మెరిసినై. వాన నీటికి కోసుగా తేలిన కంకర్రాళ్ళ మధ్యగా - తెల్లగా పావలా నాణెం.

ప్రవాహంలో కొట్టుకుపోతున్న వాడికి గడ్డి పోచ దొరికి నట్లనిపించింది.

'తను సాధించాడు' అసిరిగాడికి క్షణంలో ఏనుగంత బలం వచ్చింది. వంగి దాన్ని తీసుకున్నాడు. రెండుచేతుల్తోనూ దాన్ని తుడిచి శుభ్రంచేసి పెదవుల దగ్గర పెట్టుకుని ముద్దు పెట్టుకున్నాడు. చల్లగా తగిలింది. పైపైకి ఎగిరిపోతున్న ప్రాణం నిలబడినట్లయింది.

వైన్‌షాపు పక్కన నాయర్ కాఫీ హోటలుంది. అక్కడయితే – "రెండిడ్లీ అరకాఫీ పోగా మూడు పైసలు మిగిలాయ్" అనుకున్నాడు.

ఇడ్లీ సంగతి తలచుకునేసరికి నోరూరింది. పెదవులమీద పడుతున్న వానచినుకుల్ని నాలికతో తుడుచుకున్నాడు. చప్పగా వున్నాయి.

అడుగులు వేయసాగేడు.

వాన చినుకులు – బాణాల్లా తగులుతున్నాయి. గాలి తీవ్రమైంది. గోగు కాడ లాంటి అసిరిగాడు గాలికి వూగి పోతున్నాడు. కాలూనటం కష్టంగా వుంది.

కుక్కలు రెండు – అంత వానలోనూ కొట్లాడుకుంటున్నై. వాటి వైపు చూసేడు అసిరిగాడు. ఒకదాని నోట్లో బొమిక ముక్క!

లారీ హెడ్‌లైట్ల కాంతి అసిరిగాడి మీద పడింది. కళ్లు చిట్లించి రెండడుగులు పక్కకి తప్పుకున్నాడు. గుంటల్లోని నీళ్ళని చిమ్ముతూ వెళ్లిపోయింది లారీ. మోకాలి పైదాకా ఆ నీళ్లు కొట్టుకున్నై. "ఛీ.... యదవ లారీ...." అనుకుంటూ కదిలేడు!

కమిషన్ కొట్ల లైనులోకి తిరిగేడు అసిరిగాడు. నాయర్ హోటల్‌కు అదొక అడ్డదారి!

రెండడుగులు వేయంగానే కడుపులో తిప్పినట్లయింది అసిరిగాడికి. కళ్ళు ఛైర్లుకమ్మినట్లూ అనిపించింది. క్షణంసేపు నిలబడ్డాడు. మరుక్షణంలో వాంతి వచ్చింది. ఒంగి కక్కేశాడు. నీళ్లలా పసరు వెళ్లిపోయింది.

'పీడా పోయింది. పొట్ట హాయిగా వుంటుంది.'

'సుబ్బరంగా ఇడ్లీ తినొచ్చు'. అనుకుని ఉమ్మేసి మళ్లీ కదిలేడు.

'మూడు రోజుల్నుంచీ పేణం గునగున కొట్టుకుంటావుంది. ఆకలితీర్చే ఎదవనాయాలే కనిపించలేదు. నేననుకున్నట్టే పైసలు

దొరికినయ్యియ్యాల. ఈ పావలాతో యిప్పుడు పేణం నిలెట్టుకోవాలి. రేపటి సంగతి రేపు సూసుకోవచ్చు'— ఇలా, ఏవేవో ఆలోచనలు కలుగుతున్నై అసిరిగాడి మేడస్సులో.

సంతృప్తిగా ఊపిరి పీల్చుకున్న అసిరిగాడి ముకుపుటాలకు అదోవిధమైన వాసన కొట్టింది. ఆగేడు. అటూ ఇటూ చూపులు నిగిడ్చేడు.

ఆ రోడ్డుకు అటూ ఇటూ వరుసగా కమిషన్ కొట్లున్నాయి. వాటిలో కొన్నిటిలో ఇప్పుడు మామిడిపళ్లు పోసివున్నై. అసిరిగాడికి వాటి వాసనే వచ్చింది. ఎదురుగావున్న కొట్టుకేసి చూసేడు.

ఆ కొట్టుకు ముందుగా వున్న వసారా దిగువగా బోలెడన్ని మామిడిపళ్లు గుట్టగా పోసివున్నై.—అవన్నీ వాన నీళ్లకు తడిసి, మాగి అదోవిధమైన వాసన వేస్తున్నాయి. అసిరిగాడు ఆ కొట్టు ముందుకు వచ్చేడు.

అసిరిగాడు వాటివైపు పరీక్షగా చూసేడు.

చటుక్కున వాడికో బుద్ధి పుట్టింది.

చేతిలోవున్న పావలా నాణేన్ని వోసారి సంతృప్తిగా చూసుకుని నిక్కరుజేబులో వేసుకున్నాడు.

'ఈయేడు మామిడిపండంటూ రుచి చూళ్లేదు. అదుపట్టం కొద్దీ దొరికాయియ్యన్నీ. కమ్మటి వాసనొస్తోంది. వీటిని తిని యీ పూటకి పొట్టనింపుకుంటే- పావలా రేపటికి వాడుకోవచ్చు.

క్షణాలకిత్రితం—రేపటి సంగతి రేపు చూసుకోవచ్చు ననుకున్న అసిరిగాడికి— ఈ క్షణంలో రేపటి గురించిన ఆలోచన తొంగి చూసింది. రేప్పకూడా భద్రంకావాలనే కోరిక జనించింది.

అంతకుమించి ఆలోచించలేకపోయాడు అసిరిగాడు. వాడి

వొళ్లు ఊగిపోతోంది. వెన్నున వేడి జివ్వున పారుతోంది. ఆకలి బాధ నకనకలాడుతోంది.

వరండా మెట్లమీద కూర్చున్నాడు. పళ్ల గుట్టకు ఆ చివరగా ఒక పంది-ముట్టెతో కాయలన్నిటినీ కుళ్లగిస్తోంది.

పళ్లవైపు చూస్తూ రెండు మూడు సార్లు గుటకలు మింగేడు అసిరిగాడు.

తాలూకాలో పన్నెండు కొట్టేరు.

వానా గాలీ ప్రకృతిని ఊపివేస్తున్నాయి.

అంత వర్షంలోనూ, గాలిలోనూకూడా, ఎదురింట్లో మేడమీద పిల్ల ఏడుపు వికృతంగా వినిపిస్తోంది. అసిరిగాడు అటుగా చూసేడు. మేడమీది కిటికీ రెక్కల సందుల్లోంచి సన్నగా దీపపు వెలుగు కనిపిస్తోంది. ఉండుండి కిటికీ రెక్కలు టకటక కొట్టుకుంటున్నాయి.

వరండా రేకుమీద చినుకులు టపటప రాలుతున్నై.

అసిరిగాడు పండ్లు తినటం మొదలెట్టాడు. రసం జుర్రున జుర్రుకున్నాడు. ప్రాణం లేచివచ్చినట్లనిపించింది.

మావిఁడిపండు చాలా రుచిగా వుందనుకున్నాడు.

ఆకలి రుచి ఎరగదు! శూన్యంలోకి చూస్తూ, చిత్రమైన భంగిమలతో పండ్లు తినటం సాగించేడు అసిరిగాడు.

—నిన్న నేడుగా మారి చాలా సేపయింది! వాన క్రమంగా తగ్గుతోంది. ఆబగా పండ్లు తిని తిని అక్కడే పడిపోయాడు అసిరిగాడు.

— తెల్లవారింది. కమీషన్ కొట్లదగ్గర జనం రకరకాలుగా చెప్పుకుంటున్నారు, ఆ సంఘటనను గురించి.

"బొమ్మలు గీసే మూగోడు చచ్చిపొయాడనే" వార్త ధృవీకరించబడింది.

* * *